
# రిటైర్‌మెంట్

పవని నిర్మల ప్రభావతి




కమలమ్మ కి రోజు చాలా సంతోషంగా వుంది. సెక్రటేరియట్ నుండి బయట కొచ్చి, ఆ భవనాలకేసి ఓ మారు చూచింది. షుమారు పాతిక సంవత్సరాలు ఈ భవనాలలోని ఓ గదిలో తను వివిధ శాఖలలో ఉద్యోగం చేసింది. కొన్నిటిల్లో ప్రమోషన్లు, కొన్నిటిల్లో చీవాట్లు పొందింది. ఓ ఆఫీసర్ తన సిన్సియర్ వర్క్‌ను మెచ్చుకుంటే, మరో ఆఫీసరు తన పనిలోని లోపాలనే అస్తమానూ ఎత్తిచూపేవాడు. ఒకరోజు సంతోషం, ఒకరోజు మనసు కష్టపెట్టు కోవటం ఇలా పాతికేళ్ళ దీర్ఘకాలం గడిచిపోయింది. ఈరోజు తను రిటైర్ అయింది. ఇక రేపట్నుంచీ ఈ భవనాల వద్దకు రానవసరంలేదు. పెంషన్ వస్తుంది. అరియర్స్ వస్తాయి. కమలమ్మ నిట్టూర్చింది. దీర్ఘకాలం పోరాటంలో పాల్గొన్న వీరజవాను పోరాటం ముగిసి ఇక విశ్రాంతిగా గడిపేందుకు శలవులకు ఇంటికి వెళ్తున్న అనుభూతి కలుగుతుం దామెకు.

"నమస్కారమండీ కమలమ్మగారూ! ఏమిటలా నిల్చున్నారు!" ముప్పైఅయిదేళ్ళ గుమాస్తా సుందరం అడిగాడు.

"ఏంలేదు. ఈ రోజే నేను రిటైర్ అయ్యాను. ఆఫీసువాళ్ళందరివద్దా శలవు తీసుకొని వెళ్తున్నాను. మా డిపార్ట్‌మెంటు వాళ్ళంతా రేపు నాకు డిన్నర్ ఇస్తామని చెప్పారు. ఆఖరుసారిగా నేను పాతికేళ్ళు ఉద్యోగం చేసిన ఈ భవనాలకేసి చూస్తు న్నాను!" అంది నవ్వుతూ.

"అరె! అలాగా! పాపం! రిటైర్ అయ్యారన్నమాట. చాలా బాధండీ! రేపట్నుంచీ మీకు తోచదు.... సర్లెండి! ఎలాగోలా అడ్జస్ట్ కావాలి కదా మనం! పోనీండి! ఏవైనా ప్రైవేట్ ఫరమ్స్‌లో చిన్నచిన్న జాబ్స్ వుంటాయి. ప్రయత్నించండి. అహఁ! మీ టాలెంట్ నాకు తెలియంది కాదు. కాని ఏం చేస్తాం? రిటైరై ఇంట్లో కూర్చుని బాధపడేకంటే, ఏదో ఓ చిన్న జాబ్ అయినా చేస్తూంటే ఇటు కాలక్షేపమూ అవుతుంది, అటు



డబ్బూ కాస్త వస్తుంటుంది" అన్నాడు సుందరం.

కమలమ్మ పకపక నవ్వింది, అతగాడి గాభరా చూసి. సుందరం తనకంటే వయసులో బాగా చిన్నవాడూ, తన రెండో కొడుకు ప్రభాకరం వయసు వాడూ కావటంవల్ల, వాత్సల్యం ఉబికి వచ్చిందామె గుండెల్లో.

"కంగారేముంది నాయనా సుందరం! రిటైర్ అయినందుకు నేను దిగులు పడటంలేదు. సంతోషిస్తున్నాను. ఇక నుంచైనా కాస్తంత విశ్రాంతిగా ఇంటి పట్టున వుండొచ్చని!" అంది.

"నిజంగా?" అన్నాడు సుందరం.

"నిజంగానే సుందరం! ఇకనైనా స్థిమితంగా నేను కోరిన పుస్తకాలు చదువుకుంటాను. నా కిష్టమైన శాస్త్రీయ సంగీతం వింటాను. వస్తా సుందరం!" ఆమె గబగబా బస్‌స్టాప్‌కేసి నడిచింది ఉల్లాసంగా. బస్సు రాగానే ఎక్కింది. రోజులాగే ఈ రోజూ తోసుకుని తొక్కుకుని! నిల్చోవల్సి వచ్చింది బస్సులో. పాతికేళ్ళు ఇలాగే గడిచి పోయాయి. టెర్లిన్ షర్టులలో నుంచి వచ్చే మురికి, చెమట వాసన భరించిందీ సిటీ బస్సుల్లో. టెరికాట్ పాలియెస్టర్ చీరెల తాలూకు చెమట, సెంటు కలిపిన 'ఎలర్జీ' కలిగించే వాసనా భరించింది. ఎవరి తొందరలో వారు ప్రక్కవారిని నెట్టివేస్తూ కలిగించే వత్తిడిని సహించింది. ఈ రోజు వీటన్నిటికీ ఆఖరు రోజు.

ఇంటికి వచ్చేసరికి రోజులాగే కాబోలు సుశీల వేడినీళ్ళు సిద్ధంగా వుంచింది బాయిలర్‌లో. హాయిగా స్నానం చేసి, సుశీల ఇచ్చిన వేడికాఫీ తాగి రిలాక్సింగ్‌గా ఈజీఛేర్‌లో కూర్చుంది.

"హమ్మయ్య! ఉద్యోగం పీడా ఈ రోజుతో విరగడైంది అమ్మడూ!" అంది కోడలితో.

"పీడా వదిలిం దత్తయ్యగారూ! హాయిగా ఇంటిపట్టున వుంటారిక మీరు. నా కెంతో హాయి!" అంది సుశీల ప్రెషర్ కుక్కర్‌లో బియ్యం, కూర, పప్పు వేసి గ్యాస్ స్టౌమీద పెడ్తూ.

ఆ మాటలెంతో సంతోషం కలిగించాయి కమలమ్మకు. పేపర్ చూస్తోందే కానీ వార్తలమీద లేదు దృష్టి. గతం లోకి వెళ్ళింది మనస్సు.

షుమారు పాతిక సంవత్సరాల క్రితం, సుధాకర్, ప్రభాకర్, అరుణ చిన్న పిల్లలుగా వున్న తరుణంలో, ఓ కాళ రాత్రి కమలమ్మ భర్త శేషాచలం గుండె పోటుతో మరణించాడు. తహశీల్దారుగా ఉద్యోగం చేస్తుండిన శేషాచలం, ఓ గ్రామం తనిఖీకి వెళ్ళి, అక్కడే మరణించినా, శవాన్ని తీసుకవచ్చారు ఇంటికి.

కమలమ్మ కళ్ళముందు చీకటితెరలు కమ్ముకుపోయాయి. ఎయిత్ స్టాండర్డ్ పాసయిన తను ఇందాక ఇంటిపని, పిల్లల పనితప్ప మరోబయటి ప్రపంచం తెలియని తను, ఎలా బ్రతకాలి? ఈ బిడ్డల్ని ఎలా పెంచాలి? అన్న సమస్య ఒకటే కొండలా నిలిచిందామె కళ్ళముందు.

పెద్దన్నయ్య, రెండో అన్నయ్య, వదినె లిద్దరూ "మేం వున్నాం! నీకూ, నీ పిల్లలకూ ఏం దిగుల్లేదులేవే కమలా!" అన్నారు ధైర్యం చెబుతూ. మూడో అన్నయ్య రామ్మూర్తి మాత్రం ఖండితంగా చెప్పాడు.

"దుఃఖాన్ని దిగమింగుకో కమలా! ఈ రోజు మేమంతా వున్నామని చెప్పటమే గానీ, పదేళ్ళ తర్వాత పరిస్థితులిలా ఉండవు. మా పిల్లలూ, మా సంసారాలూ, మా ఖర్చులూ పెరిగేకొద్దీ నువ్వూ, పిల్లలూ మాకు అదనపు బరువుగా మారి తీరుతారు. ఈలోగా నీకు బావగారి మరణంతో పాటు వచ్చిన డబ్బు నలభై వేలూ ఖర్చయిపోతుంది! నీవు దిగులు మర్చిపోతావు. మీ పిల్లలకీ, మా పిల్లలకీ మధ్య ప్రతి విషయంలో ప్రతి చిన్న ఖర్చులో తేడాలూ, పోటీలూ ప్రారంభమౌతాయి. నీ వదినెలు నిన్నో పిశాచంలా, శని దేవతలా భావిస్తారు. నీ మనఃస్థితీ అలాగే తయారౌతుంది. వాళ్ళని సాధించటం, వేధించటం, నీవు కోల్పోయిన సంసారిక జీవితాన్ని వాళ్లనుభవిస్తుంటే, చూడలేనితనం, దానిని వాగ్రూపంలో పెట్టడం ఇవే నీ ఉద్యోగాలు, కాలక్షేపాలు అవుతాయి.

అంచేత ఈరోజు "మేం ఉన్నాం!" అని నీతో ఇచ్చికాలు పలికే ప్రతి ఒక్కరూ నీ భవిష్యత్తులో శత్రువులని

భావించుకో. మేం ఎవరమూ లేమనుకో. నీకున్నదల్లా నీకాళ్ల మీద నీవు నిలబడ గల శక్తి ఒక్కటే అంద. తాత్కాలికంగా నీకు నీ ఆశ్రయం ఇస్తాం! నేనూ అన్నయ్యలూ, నీకూ, నీ పిల్లలకూ, నీ చదువులకయ్యే ఖర్చు కూడా భరిస్తాం వంతుల వారీగా. ఉద్యోగంలో చేరేవరకూ చేయూతనిస్తాం.... తర్వాత నీ పిల్లల బాధ్యత నువ్వే స్వయంగా తీసుకోవాలి!" అన్నాడు.

ఆలోచించగా రామ్మూర్తి మాటలు కరెక్టు అనిపించాయి. బంధువులలో చాలా మంది రామ్మూర్తిని విమర్శించారు. స్వార్థ పూరితుడన్నారు. ప్రేమలేని తోబుట్టువు అన్నారు. ఆ తిట్లలో రామ్మూర్తి భార్య ఇందిరకు కూడా సగభాగం లభించింది.

శేషాచలం ఆ సరికే హైదరాబాదులో చౌకలో వచ్చిందని ఇళ్లస్థలం కొని వున్నాడు. ముప్పయెనిమిది వేలకు ఆరు గదులున్న ఇల్లు మూడు నెలల్లో కట్టించాడు రామ్మూర్తి. మిగతా ఐదు వేలలో బావగారి కర్మకాండలకు చాలా తక్కువగా, ఓ వెయ్యి మాత్రం- ఖర్చుపెట్టి, బంధువులందరిచేతా మరోమారు 'పిసినిగొట్టు' అని ముద్ర వేయించుకుని, మిగతా నాలుగు వేలూ చెల్లెలి పేరిట బ్యాంకిలో వేశాడు. హైదరాబాదులోనే కమలనూ, పిల్లలనూ వుంచి, తాను విజయవాడనుంచి నెలకోసారి వచ్చి చూచివెళ్లటం, అవసరమైతే సాయం చేసేవాడు. మూడు సంవత్సరాలలో కమలమ్మ మెట్రిక్ పాస్‌కావటమూ, టైప్ పరీక్షలు పాస్‌కావటమూ పూర్తయింది. సెక్రటేరియేట్‌లో ఉద్యోగంవచ్చింది.... నెలకు ఐదు వందలతో మొదలైన ఉద్యోగం, నెలకు వెయ్యి రూపాయల వరకు పెరిగింది. పది సంవత్సరాలలో హైదరాబాదు నగరం మూడింతలుగా పెరిగింది. బాడుగ ఇళ్ళకు గిరాకీ హెచ్చింది. మూడు గదుల వాటా తమ కోసం వుంచుకుని, మరో మూడు గదులు నెలకు మూడు వందల రూపాయలకు అద్దెకిచ్చింది కమలమ్మ. సుధాకర్ పెద్దవాడు. ఎం.ఏ. పాసై, బిఏ.బిఇడి పాసైన సుమతిని పెళ్లాడి, లెక్చరర్‌గా అతగాడూ, టీచరుగా ఆమె, రాజమండ్రిలో స్థిరపడ్డారు- రెండోవాడు ప్రభాకర్ బికాం పాసై, బ్యాంక్‌టెస్ట్‌లు పాసై హైదరాబాదులోనే బ్యాంకిలో ఉద్యోగం చేస్తున్నాడు. బి.ఏ. పాసైన అరుణకు ఎం.ఏ. పాసై లెక్చరరుగా విజయవాడలో పని చేస్తున్న రామకృష్ణతో వివాహమైంది. ముగ్గురికీ ఇద్దరేసి పిల్లలు పుట్టడం, ఆపరేషన్స్ చేయించుకోవటం కూడా అయిపోయింది....

ప్రభాకర్ భార్య సుశీల బి.ఎస్‌సి పాసైంది. అత్తగారు ఉద్యోగంచేస్తుంది కాబట్టి ఆమె ఉద్యోగం ఆలోచనే పెట్టుకోలేదు. ఇంటిపట్టున వుండి, పిల్లల్ని చూసుకుంటూ అందరికీ వేళకన్నీ అమరుస్తూ హాయిగా వుంటోంది. "మీ అబ్బాయి ఉద్యోగం చేస్తున్నారు కదా? మీకెందుకీ శ్రమ? రాజీనామా ఇచ్చి, ఇంటిపట్టున వుండండి అత్తయ్యగారూ!" అంది ఎన్నోమార్లు.

కమలమ్మ నవ్వేది. "ఆమాటే పది వేలమ్మా! వస్తున్న జీతం ఎందుకు కాలదన్నుకోవాలి? అరుణ పెళ్లి అప్పు తీరిపోయింది కదా నా జీతంతోనే. నేను రిటైర్ అయ్యేనాటికి ఓ యాభై వేలు వుంటాయి నావంటూ. సుధాకరానికీ, ప్రభాకరానికీ ఇస్తే చెరో ఇల్లు, కొరవ డబ్బువేసి కట్టుకుంటారు. లేదా చెరో అమ్మాయి వుందిగా! వాళ్ల పెళ్లిళ్లకు అక్కరకు వస్తుందా డబ్బు ఫిక్సెడ్ డిపాజిట్ వేస్తే!" అంది. సుశీల తలూపింది.

తనకు సాహిత్యం చాలా యిష్టం. ఎందరో రచయితలు, రచయిత్రులు వ్రాసిన వివిధ భాషా పుస్తకాలు చదవాలని వుండేది! కానీ టైమేదీ? రొటీన్, ఉద్యోగం.... ఒకటే పరుగు.... పాతికేళ్లు ఎలా గడిచిందో....


"వంటయిందత్తయ్యా!మీరు, పిల్లలు భోజనానికి రండి!" అంది సుశీల. ఉలిక్కిపడింది కమలమ్మ. గతం చెదిరింది. ఇక రోజూ విశ్రాంతే!

"ప్రభాకరం వచ్చాడా అమ్మడూ?" అంది వాత్సల్యంగా.

స్నేహితుడి కెవరికో వీడ్కోలు ఇవ్వాలట రైల్వేస్టేషన్ కెళ్లారు. వచ్చే సరికి పొద్దుపోతుంది. మీరు రండి." అంది.

ఆమె కర్థమయింది. రోజూ అంతే.





తల్లికీ పిల్లలికీ అన్నాలు పెట్టియ్య మంటాడు. తర్వాత వాళ్లిద్దరూ ఏవో కబుర్లు చెప్పకుంటూ భోజనం చేస్తారు. సిటీలో ఉద్యోగాలు చేసే చిన్న జంటలకి రాత్రి భోజనాల టైంలోనే కాస్తంత కబుర్లుకు ఆస్కారం వుంటుంది. ఆ తర్వాత, సుశీల ఇల్లు సర్దుకుని పిల్లలకు హోంవర్క్ చేయిస్తుంది. పిల్లలతో తనూ ముందు రూంలో పడుకుంటే, సుశీల ప్రభాకరం లోపల గదిలో పడుకొంటారు. వాళ్ల సరదాలకీ, కబుర్లకీ ఎప్పుడూ తను అడ్డంవెళ్లదు. అది వాళ్లిద్దరికీ ఎంతో రిలీఫ్.

భోజనం చేసి, పిల్లలతో కబుర్లు చెబుతూ పడుకుంది.... మాంచి నిద్ర. తెల్లారి త్వరగా లేవాలన్న ధ్యాసలేని నిశ్చింత అయిన నిద్రపోయిందామె. ఎనిమిదీ గంటలకు బద్ధకంగా నిద్ర లేచింది. ప్రభాకరం అంటున్నాడు సుశీలతో "ఆవిడ లేచిప్పుడేం చెయ్యాలి సుశీ! పడుకోనీ పాపం! పాతికేళ్ల శ్రమ మర్చిపోనీ!"

గుండె నిండుగా ఆనందం, వాత్సల్యం పొంగివచ్చాయి. సుశీల వంటపనిలో వుంది. "సాయం చెయ్యనా?" అంది.

"వద్దులెండి- మీరు స్నానం అదీ కానివ్వండి." అంది నవ్వుతూ. వారం రోజులు కలలా గడిచిపోయాయి. ఇష్టమైన పుస్తకాలన్నీ తీసుపెట్టుకుంది చదువుకోవటానికి. ప్రభాకరం స్నేహితుడి దగ్గర వున్నాయని తెలిస్తే, చిట్టిబాబు వీణ క్యాసెట్లు, ఈమని శంకరశాస్త్రిగారి వీణ క్యాసెట్టు, ద్వారం వెంకటస్వామి నాయుడిగారివయోలిన్ క్యాసెట్టుతెప్పించుకుంది. చిట్టిబాబు వీణలో పలకరించిన "వాతాపి గణపతిం భజేహం" నుంచి "కోయిలా" పాటవరకూ పరవశంతో విన్నది. శంకరశాస్త్రిగారి "నగుమోము గనలేని..." వింటూంటే కన్నీళ్ళుజలజలా రాలాయి. వెంకటస్వామి నాయుడిగారి వయోలిన్‌లో పలికిన "ఏ తావున నిలకడ నీకు...." అంటూ తానే త్యాగరాజు హృదయమై ప్రశ్నించిన అనుభూతి పొందింది. రోజంతా అవే కబుర్లు సుశీలతో, ప్రభాకరంతో. వాళ్ళు విని వూరుకున్నారు.

అలాగే ఆ రోజు కాసెట్ వింటోంది రూంలో కూర్చుని. మూడురూముల ఆ ఇంట్లో, గదికీ గదికీ మధ్య పెద్ద దూరం ఏముంది గనుక? ప్రభాకరం కొడుకు రమేష్‌ను కేకలువేస్తోంది సుశీల.... ప్రభాకరం సుశీలను కోప్పడ్డాడు. జవాబుగా సుశీల కాస్త హెచ్చు స్థాయిలోనే అంటోంది.

"ఏం చెయ్యను. అస్తమానూ ఇంటి చాకిరీతో చస్తున్నాను. పోనీ మీ అమ్మ కాస్త సాయంచేస్తుందా అనుకొంటే ఆవిడగారి విశ్రాంతి పిరియడ్ యింకా ముగిసినట్లు లేదు. అస్తమానూ "టుం టుం" అంటూ ఆ వీణక్యాసెట్టు, "కుంయి కుంయి" మంటూ వయోలిన్ క్యాసెట్టు- వీధిలో లారీలు బస్సులు మైక్‌లో శబ్దంతోనే తల పిచ్చెక్కిపోతుంటే, ఇంట్లో ఈ టేప్‌రికార్డర్ గోలొకటి! రిటైరయితే నాకెంతో సాయమనుకున్నాను కానీ – ఇలా గుదిబండ అవుతుందనుకోలే దావిడ గారు!"

ప్రభాకరం ఏమన్నాడో వినిపించకుండా- ఆ సంభాషణ తాను విననట్లే.... మరికాస్త సౌండ్ పెంచి, కాస్సేపు విని, తర్వాతటేప్‌రికార్డర్ ఆఫ్‌చేసిందికమలమ్మ. సుశీల మాటలలో నిజం వెన్నుతట్టినట్లైంది. అవతలివాళ్ళ కష్టంసుఖం, తన "విశ్రాంతి" మరుగున పడిపోకూడదనిపించింది...ప్రభాకరం ఆఫీసుకు వెళ్ళిపోయాడు చిరాగ్గా. ఆ మధ్యాహ్నం కాఫీలవేళలో వంటింట్లోకి వెళ్ళి, కాఫీ తయారుచేసింది.... సుశీల సంజాయిషీలా ఏదో చెప్పబోతుంటే, ఉదయం వాళ్ళ సంభాషణ తాను విననట్లే నటిస్తూ "ఏమిటే అమ్మలూ? నా క్కాస్తయినా పనిలేకపోతే తోచిచావటంలేదు. ఈపూట వంట నే చేస్తాను. ఈ పాతికేళ్ళలో వంటావార్పూ కూడా మర్చిపోయాను. మనసుపెట్టి ఏనాడు చేశాను గనుక...." అంది నవ్వుతూ. అంటూనే వంటబాధ్యత తీసుకొంది. సుశీల సంతోషించింది.

"ఒరే ప్రభాకరం! భక్తప్రహ్లాద వచ్చిందట కదా సికింద్రాబాద్ థియేటర్‌లో. నేనూ, పిల్లలూ వెళ్తాస్తాం.

పిల్లలకి మన పురాణగాథలు తెలిసినట్లూ వుంటుంది, నాకూ కాస్తంత భక్తిముక్తి వస్తాయి...." అంది మరోరోజు. ఆ తర్వాత సాధారణంగా పిల్లలూ, ఆమె ఏదేనా భక్తిసినిమాకు మాత్రం వెళ్ళటం, ప్రభాకరం, సుశీల వాళ్ళకు నచ్చిన హిందీ ఇంగ్లీషు సినిమాలకి వెళ్లటం అలవాటైంది.

"ఎప్పట్నుంచో ఎం. ఏ. చదవాలని కోరికగా వుండేదత్తయ్యా నాకు. మీ అబ్బాయి ఎందుకు లెమ్మంటూనే సరి పెట్టారిందాకా. మీరా ఉద్యోగం చేస్తుండే వారు. ఇప్పుడు మీకు ఖాళీ వచ్చింది. పిల్లలు మీదగ్గర బాగా అలవాటుపడ్డారు. నేను ఎం.ఏ పరీక్షకు కడతాను ట్యుటోరియల్ కాలేజికి వెళ్ళొస్తాను. డబ్బు ఖర్చయినా ప్యాస్ గ్యారంటీ వుంటుంది. పైగా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం క్లాసులలో ఏ టైం మనకు వీలుగా ఉంటే ఆ టైంకి మనం వెళ్ళే ఏర్పాటు చేసుకోవచ్చు." అంది సుశీల ఓ రోజు.

"ఇప్పు డెందుకమ్మా హైరాన?" అనబోయి సుశీల ఉత్సాహం చూసి అన లేకపోయింది. ఆ ఏడాదే సుశీల ఎం.ఏ పరీక్షలురాసి పాసైంది. రాజమండ్రి నుంచి సుధాకరం, సుమతి, పిల్లలు వచ్చారు దసరా శలవులకి.

"అమ్మా! ఇద్దరం ఉద్యోగాలు చేసుకుంటున్నామా, మా పిల్లలిద్దరి పన్లు, మా పన్లు చేసుకొనేసరికి సుమతికి ఆరోగ్యం దెబ్బతింటోంది. పోనీ ఉద్యోగం మానిపిద్దామా అంటే, ఈ రోజుల్లో డబ్బు విలువ ఎంతో నీకు తెలియంది కాదు. రఘు వచ్చే ఏడాది కాలేజీలో చేరాలి. రమ ఎయిత్‌క్లాస్ పాసై నైన్త్‌కు వస్తోంది.... మంచి ఇంగ్లీషు హైద్రాబాదు స్కూళ్ళలో అయితే వస్తుంది. నువ్వెలాగూ ఖాళీగా వున్నావు. ప్రభాకరం పిల్లల్ని చక్కగా చూస్తున్నావు. నా పిల్లల్నీ చూసుకోవే! ప్రభాకరంమీద ఆర్థికభారం పడనివ్వనమ్మా! నెలనెలా వాళ్ళ ఖర్చులన్నిటికీ, భోజనంతో సహా.... డబ్బు పంపుతాను...." అన్నాడు సుధాకర్. ఆ మాటే అంది సుమతి.


"ఇల్లు చాలుతుందా?" అనబోయింది, ఏమనాలో తోచక.

"ఆ! ఆ మూడు గదులు బాడుగకు ఇవ్వకుంటే సరి." అన్నాడు ప్రభాకరం! సుశీల ఒప్పుకొన్నపుడు, తను కాదనటం సబబా? అలాగే అంది కమలమ్మ. వారం తర్వాత పిల్లలిద్దరూ టి.సిలు తీసుకవచ్చి హైద్రాబాద్‌లో చేరారు. మరో నెల తిరిగేసరికి సుశీల ఓ జూనియర్ కాలేజీలో లెక్చరరుగా చేరింది.....

కమలమ్మ కిప్పుడు క్షణం తీరటం లేదు. నలుగురు పిల్లలకీ, ఇద్దరు పెద్దలకీ తెల్లారేసరికి టిఫిన్లూ, కాఫీలు, వంట పూర్తిచేసి, కారియర్లు సర్దుతుంది.



మధ్యాహ్నంవేళ సిటీబస్‌లో వెళ్ళి ఇంటికి కావలసిన పప్పులూ, కూరగాయలు, పండ్లు వగైరా తెస్తుంది. సాయంత్రం తిరిగి వంటపని.... అందరికీ భోజనాలు పూర్తయేసరికి రాత్రి తొమ్మిదవుతుంది. కొత్తగా టి. వి. కొన్నాడు ప్రభాకరం. పిల్లలు, ప్రభాకరం, సుశీల టి.వి చూస్తూ, కేరింతలు కొడుతుంటారు. ఒకోసారి సౌండ్ పూర్తిగా తగ్గించేసి, బొమ్మల మూకాభినయానికి పిల్లలు కేరింతలు కొడుతుంటే, ఒక్కొసారి సౌండ్ పూర్తిగా పెంచి ఏ మంత్రిగారి భయంకర గొంతుక తాలూకు ఉపన్యాసానికో - విమర్శిస్తూ సుశీల, ప్రభాకరం చిన్నపిల్లల్లా చప్పట్లు చరుస్తుంటారు. ఆదివారం అయితే ఇక పిల్లలు టి.వి. వదిలి రారు. ఓ పట్టాన టిఫిన్లు, కాఫీలు, వంట, భోజనాలు తెమలవు. మొదట్లో పిల్లలంతా బామ్మవెంట భక్తిసినిమాలకు వచ్చే వారు. ఇప్పుడలా కాదు. రఘు బాగా వూహ తెలిసిన కుర్రాడు. వాడికి హిందీ, ఇంగ్లీషు, మళయాళీ ప్రేమచిత్రాలు




కావాలి. మిగతా పిల్లల్నీ పురికొల్పుతాడు. "నువ్వూ రా బామ్మా!" అంటాడు. అవి పిల్లలు చూచే సినిమాలా? పిల్లలు అవన్నీ చూస్తుంటే— నిస్సహాయంగా, సాక్షీభూతురాలిలా తనూ వాళ్ళవెంట వెళ్ళటం ఎంత ఖర్మ. తర్వాత "నేను రాలేనురా బాబూ!" అనటం మొదలెట్టింది. పిల్లలే వెళ్ళొస్తున్నారు. ఆ ఇల్లు చాలక, అది బాడుగకు ఇచ్చేసి, మరో పెద్దఇల్లు బాడుగకు తీసుకున్నారు ప్రభాకరం, సుశీల. ఫ్రిజ్ వచ్చింది. పెద్దసైజు టూ-ఇన్ వన్ వచ్చింది. ఫోనూ, ఫోంబెడ్స్ వచ్చాయి. కమలమ్మకు మరింత పనిబాధ్యత పెరిగింది. టూ - ఇన్ వన్‌లో పిల్లలు హిందీ పాటలు, తెలుగు పాటలు పెద్దసౌండుతో పెడతారు. స్టిరియో సిస్టమ్‌తో ఇల్లెగిరిపోయే శబ్దం.... కమలమ్మ తల పగిలిపోతుంటుంది. ఆ మాటను ఐదారు మార్లు ప్రభాకరానికీ, సుశీలకు చెప్పిచూచింది.

"ఏం వెధవ పాటలే అవి! వింటుంటే ప్రాణం పోతోంది. పిల్లలు వినవలసిన పాటలేనా అవి! అదలా వుంచు, అస్తమానూ వింటే పిల్లలకైనా మంచిది కాదు...."

ప్రభాకరం నవ్వాడు. "చుట్టూరా వున్న వాతావరణం అదమ్మా! మనింట్లో విననివ్వకుంటే, స్నేహితులింట్లో వింటారు. మైకుల్లో, సినిమాల్లో వినిపించే పాటలే అవి. ఇక శబ్దం అంటావా? ఆ శబ్దానికి పిల్లలూ, మేం అలవాటు పడిపోయాం. అమ్మా! ఇదో కొత్త యుగం. మనకేముందని కాదు ప్రశ్న! ప్రక్కవాడి కేముంది? ఏం కొన్నాడు? అన్నదే సమస్య. పిల్లల్ని కట్టడిపెట్టి లాభంలేదు." అన్నాడు.

"సిటీలలో ట్రాఫిక్ తప్పుకొంటూ రోడ్డు క్రాస్‌చేసే చిన్నబిడ్డలను గమనించండి అత్తయ్యా! ఎంత మెలకువ ఎంత నేర్పుగా దాటుతారో! ఈ యాంత్రిక యుగంవాళ్ళని చిన్నతనంలోనే "మెదడు మెచ్యూర్" అయ్యేలా తీర్చిదిద్దింది. మీరు కంగారుపడకండి" అంది సుశీల. ఈ కోడలే ఒకనాడు తాను కొద్ది సౌండులో శాస్త్రీయ సంగీతం వింటుంటే శబ్దం భరించలేనంది!

మరో నెల గడిచిందో లేదో అరుణ, అరుణ భర్త రామకృష్ణ వచ్చారు, పిల్లలిద్దరితో.

"వీడి కెప్పుడూ ఏదో ఓ నలతే అమ్మా! పోతపాలు. రోగాలు. చస్తున్నాను చేసుకోలేక. వీణ్ణి నీ దగ్గర వుంచుకోవే. పిల్లడికాన్వెంటులో చేర్పించాము. బాధలేదు. నేను బి.ఇడి.లో చేరి, పాసై ఉద్యోగం చెయదల్చుకున్నాను. వదినె లిద్దరూ చేస్తున్నారు జాబ్! మేమూ టి.వి., ఫ్రిజ్ కొనుక్కోకపోతే ఏం విలువ?" అంది అరుణ. తను నిర్ఘాంతపోయింది. అల్లుడు రామకృష్ణకు కోపం వచ్చింది....


"మీ అమ్మ కిష్టంలేనట్లుగా వుంది అరుణా మనవాణ్ణి దగ్గరుంచుకోవడం. అవున్లే! కొడుకుబిడ్డలమీద వుండే ప్రేమ.... కూతురిబిడ్డలమీద ఎందుకుంటుంది...." అన్నాడు....

ఇతగాడు .... నిజంగా ఎం.ఏ. పాసయ్యాడా? ఆ చదువు వీడిలో పెంచిన సంస్కారం ఆలోచనా ధోరణి ఇదా? మరోసారి నిర్ఘాంతపోయింది కమలమ్మ.

"మా అత్తగారు నా పిల్లల్ని లక్షణంగా వుంచుకొంటుందే అమ్మా! కానీ, రేపు ఎప్పుడైనా 'మీ అమ్మ పెంచనంటే నేను కాదూ పెంచానూ!' అని దెప్పుతుంది.... అవకాశం ఆవిడ కివ్వకూడదనే గానీ .... నా పిల్లాడు నాకు బరువై కాదు. 'కేర్‌సెంటర్'లో వదిలి— నేను బి.ఇడి. పాసౌతాను. అంతేగానీ, నా చదువు, ఉద్యోగం మానుకోనుగాక, మానుకోను!" అంది అరుణ కోపంగా...

కమలమ్మ నవ్వింది. "పిల్లాణ్ణి వుంచి వెళ్ళు. రెండేళ్ళలోపు నీ పిల్లాడికి వేళకు పోతపాలు, ఆహారం, మందులు....ఆ బాధ్యతా ఇక నీదే!" అంది అరుణ!, రామకృష్ణ ప్రసన్నంగా వెళ్ళిపోయారు.

ఆ రోజంతా— ఆ వారమంతా పిల్లాడు తల్లికోసం బెంగపడ్డాడు. జ్వరం వచ్చింది. అయినా అరుణ, రామకృష్ణ రాలేదు. 'వాడే సర్దుకుంటాడు.' అన్నారు ఫోన్‌లో. ఇంటిపని, పిల్లలందరి పనితో బాటు పసివాడి పెంపకం.... అదీ నలభై ఏళ్ళతర్వాత, సర్కస్ చేసినట్లుంది ప్రాణానికి. వీడో తల్లిని మరిచే ప్రయత్నంలో అమ్మమ్మను ఆసరాగా చేసు




కోవటానికి అస్తమానూ కరుచుక పడుకొంటాడు. జబ్బు చేస్తే పక్కలో ఒంటేలు పోస్తాడు. కమలమ్మకు నిద్ర పట్టదు. రాత్రంతా జాగారం. పగలంతా పని.... ఆ రాత్రి అసలు నిద్రపట్టలేదు ఆమెకు.

ఏమిటీ జీవితం?

రిటైర్ అయ్యాక, తాను సాహిత్యం చదవ్వొచ్చనుకుంది. సంగీతం వినవచ్చు అనుకుంది. భక్తిమార్గం చూచుకోవచ్చు అనుకుంది. ముగ్గురు పిల్లల బాధ్యతలు పూర్తయ్యాయి కాబట్టి, ఆ బిడ్డలు తనని అపురూపంగా చూచుకుంటుంటే, వాళ్ళకి చేతనైన సాయంచేస్తూ, నిర్బాధ్యంగా శేషజీవితం గడపవచ్చని కలలు కన్నది. కానీ జరిగిందీ, జరుగుతున్న దేమిటి? కొత్త బాధ్యతలు చుట్టుముట్టాయి. 'జనరేషన్ గాప్'లోని మార్పులకు తనెంత సర్దుకుపోయినా, తట్టుకోలేకపోతోంది. సాహిత్యం లేదు, సంగీతం లేదు, భక్తి లేదు, ముక్తి లేదు. కుడితిలో పడ్డ ఎలుకలా గిలగిలా తన్నుకొంటోంది. ఎవరికి వారికి తమ పిల్లలిద్దరే బరువై, ఆ బరువు తన నెత్తిమీదికి తోసేశారు. ఆ పిల్లల ధోరణీ, సినిమాలూ, చర్చలూ, కబుర్లూ - తను సహించలేనివి. అలాగని తను కంట్రోల్ చేయలేనివి. అంత శక్తిలేదు తనకి శారీరకంగా, మానసికంగా. పాతికేళ్ళ జీవిత పోరాటంలో అలసి, అరిగిపోయిన తన శరీరం, మెదడూ, ఏ చిన్న బరువూ మోయలేని స్థితిలో వుంది. ఇది గ్రహించే వాళ్ళెవరు? తన పిల్లలకే అర్థంకానప్పుడు తన కోడళ్ళకీ, అల్లుడికీ అర్థమవుతుంది అనుకోవటం భ్రమ కాదూ?

మగాళ్ళు రిటైర్ అయితే, మరో రకంగా బాధపడతారని విన్నది తాను. ఎంతకీ తమని కొడుకులు, కోడళ్ళు ఆర్థికపరంగా గౌరవించటంలేదని బాధపడతారు వాళ్ళు.... కానీ, కానీ స్త్రీ సమస్య అదికాదే! ఆమెకు జీవితంలో బాధ్యతలనుంచి రిటైర్‌మెంట్ లేదా? రాదా? చివరి శ్వాసవరకూ ఇలా లాగవలసిందేనా? ఖర్మం చాలక మంచంలో పడితే, ఇకామె బ్రతుకు మరింత దుర్భరం అవుతుంది. ఈ కొడుకులూ, కోడళ్ళూ, కూతుళ్ళూ, అల్లుళ్ళూ ఆమె గతకాలపు సేవ అంతా విస్మరించి, ప్రస్తుతపు బరువే గుర్తుంచుకుంటారు.... ఎలా ఈ శని విరగడౌతుందాని బాధపడతారు.... ఏది దారి....

తెల్లవారుఝాముకు ఆమె ఒక నిర్ణయాని కొచ్చింది....

"ప్రభాకరం నేను అర్జంటుగా విజయవాడ వెళ్తున్నారా!" అంది.

"ఎందుకమ్మా?"

"అరుణను చూడాలి."

"నెలక్రితం వచ్చి వెళ్ళింది కాదుటే? నువ్విలా హఠాత్తుగా ప్రయాణం పెట్టుకుంటే మా గతేంకావాలి! ఈ పని, ఈ పిల్లలు, మా ఉద్యోగాలు ఏవీ ఆలోచించ లేదా? ఇంత బాధ్యతారాహిత్యం అయితే ఎలా?" అన్నాడు. నవ్వువచ్చింది కమలమ్మకు. 'బాధ్యతారాహిత్యం!' ఎంత మాట, ఇక 'బాధ్యత'కు అర్థం ఏమిటో వీళ్ళ దృష్టిలో!

"కాదురా వెళ్ళాలి!" మొండిగా అని, జవాబుకు ఎదురుచూడకుండా సూట్‌కేసునూ, అరుణ కొడుకుని వెంట బెట్టుకుని రిక్షా ఎక్కిందది. బస్సులో కూర్చుంది.

"ఇలా అర్ధాంతరంగా నా పిల్లాణ్ణి నా నెత్తిమీద తోస్తే ఎలాగే అమ్మా? నాకు జాబ్ వచ్చి మూడు నెలలేగా అయింది? ఆ జాబ్ రావటానికి లంచంగా నాలుగు వేలు కట్టాను. కనీసం ఆ నాలుగువేలయినా సంపాయించుకోనివ్వవే!" అంది అరుణ నిష్ఠూరంగా.

"మనం, ఆవిడగారి కొడుకులకంటే ఆర్థికంగా ఎక్కువ స్థాయిలోకి వెళ్ళిపోతామేమోనని ఆవిడగారి భయం కాబోలు అరుణా!" అన్నాడు అల్లుడు రామకృష్ణ మరింత కోపంగా.

"అవున్నాయనా!" అంది కమలమ్మ నవ్వి. పిల్లాణ్ణి అప్పగించి, సూట్‌కేసు తీసుకుని బస్‌స్టాండ్ కెళ్ళి, బస్సెక్కింది.

ఆ బస్సుల్లో అగమ్యంగా వెళ్ళిపోయింది. ఉత్తర హిందూస్థాన్‌లో ఓ "వృద్ధుల ఆశ్రమంలో "(Old age home)" స్థిరపడింది. ఈ ఏర్పాటు క్కావల్సిన డబ్బు, తనకు వచ్చిన అరియర్స్‌లో నుంచి ఓ పదివేలు డ్రాఫ్టుద్వారా ముందే పంపిందావిడ, తన పేరుతో ఈ హోంకు. అలాగే తన ఫోటో వివరాలు పంపింది. ఇదంతా ఓ పదిరోజుల క్రితం ఓ ప్లాను ప్రకారం చేసుకుందావిడ. ఆవిడ బయటకు వెళ్ళినా, ఇంట్లో వున్నా, తమ పన్లు జరిగిపోతున్నవరకూ, ఎవరూ పట్టించుకోరని ఆమెకు తెల్సు.

నెల తర్వాత, "అమ్మ ఎక్కడికి వెళ్ళిందో తెలీలేదురాఅన్నయ్యా! ఏమిటో మూడ్స్ మనిషి. అలవాటు తప్పిపోయిన ఇంటిపని, జాబ్, ఈ పిల్లమూక గోల, అవసరాలతో సుశీల సతమతమైపోతోంది. నమ్మకమైన పనిమనిషి కోసం గాలిస్తున్నాను. నీ ఇద్దరు పిల్లల్నీ రాజమండ్రిలోనే కాలేజీలో చేర్చుకో. నా ఇద్దరు పిల్లల్నీ నేను హాస్టల్‌లో పెట్టేద్దామనుకుంటున్నాను." అని రాశాడు ప్రభాకరం సుధాకర్‌కి.

"ఏమిటో ఆవిడ ఖర్మ! లక్షణంగా ఇద్దరు కొడుకులం, ఇద్దరు కోడళ్ళు, కూతురు, అల్లుడు వున్నాం. మా అందరి పిల్లలూ వున్నారు. అందరి మధ్యా నిశ్చింతగా వుండక— ఎటు పారిపోయిందో ఏమో ఖర్మ! దేనికైనా 'రాత' వుండాలండీ! 'రాత! అనుభవించే యోగం వుండాలి మనిషికి.' అన్నాడు సుధాకరం చుట్టుప్రక్కల వారితో.

మరో ఆరు నెలల తర్వాత, కమలమ్మ ఉత్తర హిందూస్థానంలోని "ఓల్డేజ్ హోం"లో ఉన్నట్లు తెలిసింది వాళ్ళకి. ముగ్గురూ వెళ్ళారు.

"ఇదేం ఖర్మమ్మా నీకు? దిక్కులేని దానిలా?" అనరిచారు, సుధాకర్, ప్రభాకర్, అరుణలు.

తల్లి ఆరోగ్యంగానే వుంది. ఆనందంగానే వుంది.

"రిటైరయిన తల్లికి తిండిపెట్టకుండా తరిమేశారన్న నింద, డబ్బు మాత్రం లాగేసుకున్నారన్న చెడ్డపేరు మాకు తేవటానికా ఈ పని చేశావ్?" అన్నారు సుధాకర్, ప్రభాకర్‌లు.

"నా దగ్గర వచ్చి వుండవే అమ్మా!" అంది కరుణ.

కమలమ్మ నవ్వింది. "మీ రెలా అనుకున్నా, లోకం ఎలా అనుకున్నా. నేను బాధపడన్రా! తల్లిగా, నా శక్తి వంచన లేకుండా, మీ ముగ్గురి జీవితాలు ఓ దారిలో పడేందుకు కృషి చేశాను. ఇప్పుడు మీ సంసారాలు మీవి అయిపోయాయి. ఈ కాలానికి తగ్గట్లు మీ ఆర్థిక అవసరాలూ, మీ ఆలోచన్లూ వుంటాయి. అదీ నే నర్థంచేసుకోగలను. ఇక నేను మీకు చేయవలసిందేమీ లేదు. నేను మీ పిల్లల బాధ్యతల బరువుల్ని మోయలేను. నాకు వృద్ధాప్యం. విశ్రాంతి కావాలి. మీ ఎవరి దగ్గరున్నా నాకు బాధ్యతే. బరువే. వృధాగా తింటూ కూర్చుంటే మీకు నేను బరువైపోతాను. ఈ యాంత్రిక యుగంలో నాదో అదనపు బరువు కాకూడదు మీకు. ఇక్కడ నిశ్చింతగా దైవధ్యానం చేసుకుంటున్నాను. నాకు ఓపిక వున్న చిన్న పనేదేనా చేస్తాను. అదేం నిర్బంధం కాదు. నా తదనంతరం మరో పదివేలు నాలాంటి వృద్ధుల సౌకర్యార్థం ఈ 'హోం'కు చెందేలా ఏర్పాటు చేశాను .... వెళ్ళిరండి.... నే చనిపోయినప్పుడు వీళ్ళు తెలియచేస్తారు. నా 'కర్మ'కు ఖర్చుపెట్టకండి. ఆ 'కర్మ'లో నాకు నమ్మకంలేదు. నా ఆత్మకు శాంతి కలగదు. నిజమైన రి టై ర్మెం టు.... విశ్రాంతి నే నిప్పుడు పొందుతున్నాను" అంది దృఢంగా.

